సాక్షి అనంతపురం

శుక్రవారం । 17 । నవంబర్ । 2023



టన్ను చీనీ రూ.28 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో గురువారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.28 వేలు పలికాయి.



కిలో టమాట రూ.18

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో గురువారం కిలో టమాటా గరిష్టంగా రూ.18 మేర పలికింది. మార్కెట్‌కు 2,100 టన్నుల సరుకు అమ్మకానికి వచ్చింది.

గరిష్టం/కనిష్టం

35.4°/ 18.6°

జిల్లా అంతటా గురువారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమైంది. వేకువజామున మంచు కురుస్తోంది.

న్యూస్‌రీల్

మెరుగైన వైద్యం అందించాలి



సిబ్బందికి సూచనలిస్తున్న నారాయణ స్వామి

గార్లదిన్నె: గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని 'ఫ్యామిలీ డాక్టర్' జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ నారాయణ స్వామి పేర్కొన్నారు. గురువారం కల్లూరులో నిర్వహించిన 'ఫ్యామిలీ డాక్టర్' కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ప్రజలకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్న ఊరిలోనే వైద్య సేవలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే వారికి ఉచితంగా మందులు పంపిణీ చేస్తోందన్నారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. పిల్లలకు బుధవారం, శనివారం ఐరన్ సిరప్ వేయాలని, వైద్య పరీక్షలు చేయించాలని సిబ్బందికి సూచించారు. కల్లూరు ప్రాథమిక పాఠశాలను పరిశీలించి, ప్రతి గురువారం విద్యార్థులకు ఐరన్ మాత్రలు వేయాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ మనీషా, సూపర్‌వైజర్ సూర్యకళ, హెల్త్ అసిస్టెంట్ శివయ్య, ఎంఎల్‌హెచ్‌పీ మధులత, ఏఎన్‌ఎం నాగేశ్వరి,ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ సిబ్బంది తదితరులున్నారు.

విద్యారంగానికి పెద్దపీట



మాట్లాడుతున్న డీఈఓ నాగరాజు

అనంతపురం ఎడ్యుకేషన్: రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి పెద్దపీట వేసిందని కేజీబీవీల జాయింట్ డైరెక్టర్ గీత, జిల్లా విద్యాశాఖ అధికారి నాగరాజు తెలిపారు. కేజీబీవీల్లో నూతనంగా ఎంపికైన సీఆర్టీలు, పీజీటీలకు ఆరు రోజుల రాష్ట్రస్థాయి శిక్షణ గురువారం ప్రారంభమైంది. అనంతపురం నగర శివారులోని వైవీ శివారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని కేజీబీవీ జాయింట్ సెక్రెటరీ గీత ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమెతో పాటు జిల్లా విద్యాశాఖ అధికారి నాగరాజు, సమగ్రశిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ వరప్రసాద రావు మాట్లాడారు. అనాథ, పేద విద్యార్థినుల కోసం ఏర్పాటు చేసిన కేజీబీవీల్లో నాణ్యమైన విద్య అందించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లోని పేద విద్యార్థులు ప్రపంచస్థాయిలో పోటీ పడాలనే ఉద్దేశంతో సీఎం వైఎస్ జగన్ సమూల మార్పులు తీసుకొచ్చారన్నారు. నాడు–నేడు ద్వారా బడుల్లో మౌలిక వసతులు కల్పించారన్నారు. కార్పొరేట్ స్థాయికి మించి ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయన్నారు. ప్రభుత్వ సంకల్పానికి అనుగుణంగా పనిచేయాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. కార్యక్రమంలో జీసీడీఓ మహేశ్వరి, పరిశీలకులు వెంకటరెడ్డి, తదితరులున్నారు.


'కుల గణన'పై నేడు సమావేశం

అనంతపురం రూరల్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న 'కుల గణన' అంశంపై శుక్రవారం సమావేశం నిర్వహిస్తున్నట్లు సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ మధుసూదన్‌రావు ఓ ప్రకటనలో తెలిపారు. కలెక్టర్ కార్యాలయంలోని రెవెన్యూ భవన్‌లో మధ్యాహ్నం 3 గంటలకు కలెక్టర్ గౌతమి ఆధ్వర్యంలో సమావేశం ప్రారంభమవుతుందన్నారు. మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు హాజరవుతారన్నారు. ఉద్యోగ సంఘాల నాయకులు, మేధావులు సలహాలు అందజేయవచ్చన్నారు.

బడుగులతో బంతాట..!

- టీడీపీలో అగ్రవర్ణాలదే పెత్తనం
- ఉనికి కోసం బడుగు బలహీన వర్గాల నిత్య పోరాటం
- రిజర్వుడు నియోజకవర్గాల్లోనూ అగ్రకులాల నేతలు చెప్పిందే వేదం
- టూమెన్ కమిటీతో శింగనమలలో శ్రావణిని పక్కకు నెట్టిన వైనం
- మడకశిరలో గుండుమల కనుసన్నల్లోనే పార్టీ వ్యవహారాలు
- కదిరి నియోజకవర్గంలో మైనార్టీ మాట.. చెల్లని రూక
- అవమానాలు ఓర్వలేక తలోదారి చూసుకుంటున్న నాయకులు

అధికారంలో ఉన్నప్పుడే కాదు.. విపక్షంలోనూ బడుగు, బలహీన వర్గాల పట్ల చంద్రబాబు చిన్న చూపు ప్రదర్శిస్తున్నారు. అగ్ర కులాల వారే పెత్తనం చెలాయించేలా చూస్తున్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలతో బంతాట ఆడుతూ అడుగడుగునా అవమానాలకు గురి చేస్తున్నారు. టీడీపీ పెత్తందార్ల పార్టీనే అని నిరూపిస్తున్నారు. జిల్లాలో పలు నియోజకవర్గాల్లో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులు.. చంద్రబాబు, చినబాబు లోకేష్‌ల ద్వంద్వ వైఖరిని చెప్పకనే చెప్పేస్తున్నాయి.



సాక్షి ప్రతినిధి, అనంతపురం: పేదలు, బడుగు బలహీన వర్గాల కోసమని ఎన్టీ రామారావు తెలుగు దేశం పార్టీని స్థాపించారు. చెప్పినట్లుగానే పెద్దపీట వేసి సముచిత స్థానం కల్పించారు. ఆయనకు వెన్నుపోటు పొడిచి పార్టీని లాక్కున్న చంద్రబాబు.. ఎన్టీఆర్ సిద్ధాంతాలకు ఫుల్ స్టాప్ పెట్టారు. పార్టీని క్రమంగా పెత్తందార్లకు అడ్డాగా మార్చారు. టీడీపీలో రాజకీయంగా ఎదగాలంటే బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ నేతలు నిత్యం పోరాటం చేయాల్సిన పరిస్థితి. ఆత్మాభిమానం చంపుకోలేక ఎంతో మంది ద్వితీయ శ్రేణి నాయకులు పార్టీ నుంచి బయటకు వస్తున్నారు.

శింగనమలలో దారుణంగా..

ఎస్సీలకు కేటాయించిన రిజర్వుడు స్థానాల్లోనూ టీడీపీకి చెందిన అగ్రకులాల నేతలు పెత్తనం చెలాయిస్తున్నారు. శింగనమల నియోజకవర్గంలో ఎస్సీ అభ్యర్థి పరిస్థితి గమనిస్తే ఈ విషయం స్పష్టంగా అవగతమవుతుంది. తెలుగుదేశం పార్టీ నేత బండారు శ్రావణిని ఇక్కడ డమ్మీగా మార్చారు. టూమెన్ కమిటీ పేరుతో ముంటిమడుగు కేశవరెడ్డి, ఆలం నరసనాయుడును నియమించి అవమానించారు. వీళ్లు చెప్పినట్టే అక్కడ పనులు జరుగుతున్నాయి. ఇటీవల శ్రావణి తండ్రిపై దాడి జరిగింది. ఆ సమయంలో 'యువగళం' పాదయాత్రలో భాగంగా లోకేష్ జిల్లాలోనే ఉన్నారు. దాడికి పాల్పడిన వారిని మందలించనూ లేదు. దెబ్బలు తిన్న వ్యక్తిని పరామర్శించనూ లేదు.

గుండుమల.. ఎస్సీ నేతల విలవిల

మడకశిర ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గం. ఇక్కడ మైనింగ్ మాఫియాకు అధిపతిగా చెప్పుకునే గుండుమల తిప్పేస్వామిదే పెత్తనం. ఆయన నియంత వైఖరిని జీర్ణించుకోలేని ఈరన్న వర్గానికి చెందిన ఎస్సీ నాయకులు పార్టీకి ఆమడదూరం వెళ్లిపోయారు. డబ్బున్న వాళ్లే రాజకీయాలు చేస్తున్నారని, ఎస్సీలను పట్టించుకునే నాథుడే లేరని ఉన్న కొద్దిపాటి ద్వితీయశ్రేణి నాయకులు వాపోతున్నారు. ఇప్పటికే పలు సామాజిక వర్గాల నేతలు పార్టీ నుంచి బయటకు వచ్చేశారు. ఇక్కడ పార్టీకి పరిస్థితి ఏ మాత్రం అనుకూలంగా లేదన్న సర్వేలు అధిష్టానానికి వెళ్లినట్లు తెలిసింది.

మైనార్టీ మాట చెల్లని రూక..

2014లో జరిగిన ఎన్నికల్లో కదిరిలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున అత్తార్ చాంద్‌బాషా గెలిచారు. ఆ తర్వాత టీడీపీలోకి వెళ్లారు. ఇప్పుడాయన మాట చెల్లని రూక అయింది. డీజీల కుంభకోణంలో శిక్ష పడిన కందికుంట ప్రసాద్ మాటే పైచేయిగా మారింది. నేరాలకు తెగబడుతున్నా కందికుంటనే చంద్రబాబు, లోకేష్ ప్రోత్సహిస్తున్నారనేది బహిరంగ రహస్యమే. దీంతో ఇక్కడ మైనార్టీ నాయకులు తెలుగుదేశం పార్టీపై మండిపడుతున్నారు.

అంతటా అంతే..

ఉమ్మడి జిల్లాలో అన్ని చోట్లా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల నాయకుల మాట చెల్లడం లేదు. అధికారంలో ఉన్నప్పుడూ.. ఇప్పుడూ అగ్ర కులాల వారు పెత్తనం చెలాయిస్తుండడంతో రగిలిపోతున్నారు. ఇక.. ఎన్నికల ముందు చెప్పినట్లుగానే అధికారంలోకి వచ్చాక సీఎం వైఎస్ జగన్ అన్ని సామాజిక వర్గాలకు సముచితం స్థానం కల్పించారు. పెద్ద ఎత్తున రాజకీయంగానూ పదవులు కట్టబెట్టారు. చెప్పాడంటే.. చేస్తాడంటే అనేంతలా పేరు తెచ్చుకున్నారు. అన్ని వర్గాల మనసులనూ గెలుచుకున్నారు. ఈ విషయాన్ని గుర్తించిన టీడీపీలోని బడుగు బలహీన వర్గాల నాయకులు ఇప్పటికే పలు చోట్ల అధికార పార్టీలో చేరుతున్నారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో వలసల తాకిడి మరింత ఎక్కువయ్యేలా కనిపిస్తోంది. టీడీపీకి బడుగు బలహీన వర్గాల నేతలు గట్టి షాక్ ఇవ్వనున్నట్టు తెలుస్తోంది.

పకడ్బందీగా దరఖాస్తుల పరిశీలన



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ గౌతమి

అనంతపురం అర్బన్: ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో అందిన ఫారం–6, 7, 8 దరఖాస్తులు పరిశీలించి, పరిష్కరించే ప్రక్రియను జిల్లాలో పకడ్బందీగా నిర్వహిస్తున్నామని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈఓ) ముకేష్ కుమార్ మీనాకు కలెక్టర్ ఎం.గౌతమి తెలిపారు. పెండింగ్ దరఖాస్తులు, రాజకీయ పార్టీల ఫిర్యాదులు తదితర అంశాలపై సీఈఓ గురువారం విజయవాడ నుంచి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతపురం కలెక్టరేట్ నుంచి కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్, డీఆర్ఓ గాయత్రిదేవి పాల్గొన్నారు. జిల్లాలో ఓటరు జాబితా సవరణ, పెండింగ్ దరఖాస్తుల పరిష్కారం తదితర అంశాలపై సీఈఓకు కలెక్టర్ ఈ సందర్భంగా వివరించారు. ఓటరు జాబితా సవరణకు అందిన దరఖాస్తులను ఎన్నికల కమిషన్ నిబంధనలు, మార్గదర్శకాలకు అనుగుణంగా పరిశీలించి పరిష్కరిస్తున్నామన్నారు. జంక్ క్యారెక్టర్స్, 10కిపైన ఎలక్టోరల్స్ ఉన్న వాటికి సంబంధించి వారంలోపు పరిష్కరిస్తామన్నారు. చేర్పులు, తొలగింపుల ప్రక్రియ ప్రారంభించామన్నారు. రాజకీయ పార్టీల నుంచి అందిన ఫిర్యాదులను సకాలంలో పరిష్కరిస్తామని కలెక్టర్ చెప్పారు. పీఎస్‌ఈలు, డీఎస్‌ఈల పరిధిలో డబుల్ ఎంట్రీలు, షిఫ్టెట్ ఓటర్ల పెండింగ్‌ను త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓలు గ్రంధి వెంకటేష్, రాణి సుస్మిత, సి.శ్రీనివాసులురెడ్డి, డిప్యూటీ కలెక్టర్లు రవీంద్ర, సుధారాణి, వెంకటేశ్వర్లు, విశ్వనాథ్, డీపీఓ ప్రభాకర్‌రావు, ఎన్నికల డీటీ కనకరాజు, ఎస్ఏ శామ్యూల్ బెంజిమెన్, తదితరులు పాల్గొన్నారు.

బాల కార్మికుల గుర్తింపునకు ప్రత్యేక డ్రైవ్

- జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్

అనంతపురం అర్బన్: బాల కార్మికులను గుర్తించేందుకు జిల్లావ్యాప్తంగా 20 రోజుల పాటు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ ఆదేశించారు. జేసీ గురువారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాను బాల కార్మిక రహితంగా మారుద్దామని పిలుపునిచ్చారు. జాతీయ బాలల హక్కుల పరిరక్షణ సంస్థ ఆదేశాల మేరకు ఈనెల 20 నుంచి డిసెంబరు 10 వరకు బాల కార్మిక తనిఖీల డ్రైవ్ నిర్వహించాలని చెప్పారు. దుకాణాలు, హోటళ్లు, మెకానిక్ షాపులు, డాబాలు, ఇటుకబట్టీలు, భవన నిర్మాణ పనులు, గనులు తదితర ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించాలన్నారు. 14 ఏళ్లు అంతకు లోపు వయసున్న బాలలతో పనిచేయించడం చట్టరీత్యా నేరమన్నారు. ఈ వయసు బాలలతో పనిచేయిస్తున్న



అధికారులతో సమీక్షిస్తున్న జేసీ కేతన్‌గార్గ్

యాజమాన్యాలు, యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బాల కార్మికులను గుర్తించి పాఠశాలల్లో చేర్పించాలని చెప్పారు. ప్రమాదకర వృత్తుల్లో 15 ఏళ్ల నుంచి 18 ఏళ్లలోపు బాలలతో పనిచేయించడం నేరమన్నారు. చట్టాలను ఉల్లంఘించిన యాజమాన్యాలపై కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. తనిఖీలు నిరంతరం కొనసాగించాలని సూచించారు. సమావేశంలో సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ మేడా రామలక్ష్మి, కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ లక్ష్మినరసయ్య, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ మధుసూదన్ రావు, ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి, ఫ్యాక్టరీస్ డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ కేశవులు, డీఈఓ నాగరాజు, సమగ్ర శిక్ష ఏపీసీ వరప్రసాద్, కార్మిక శాఖ ఏసీ రఘురాములు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

భూసేకరణ పూర్తవ్వాలి

ప్రభుత్వ ప్రాజెక్టులకు సంబంధించి భూసేకరణ ప్రక్రియలో జాప్యానికి తావివ్వకుండా త్వరితగతిన పూర్తిచేయాలని జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో అధికారులతో సమీక్షించారు. జిల్లాలో 544డీ జాతీయ రహదారి, బీటీపీ, రైల్వే ప్రాజెక్టులు, బంజారా, ఎరుకల భవనాలు, గురుకుల పాఠశాలలు, విభిన్న ప్రతిభావంతుల గృహం, కార్పొరేషన్లకు కమ్యూనిటీ భవనాలు, పర్యాటక రంగం తదితర ప్రాజెక్టులకు సంబంధించి భూసేకరణను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్డీఓలు గ్రంధి వెంకటేష్, రాణి సుస్మిత, శ్రీనివాసులు రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పారదర్శకంగా 'సంక్షేమం'

అనంతపురం/టవర్‌క్లాక్: రాష్ట్రంలో సంక్షేమ పథకాల అమలు పారదర్శకంగా సాగుతోందని సీ.రాఘవాచారి ఏపీ మీడియా అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు అన్నారు. గురువారం స్థానిక ఆర్అండ్‌బీ అతిథిగృహానికి చేరుకున్న ఆయనకు డీపీఆర్ఓ గురుస్వామిశెట్టి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. అనంతరం కొమ్మినేని శ్రీనివాసరావు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు, రైతులు, మహిళలు, విద్యార్థులు, యువత తదితర వర్గాలు పొందిన ప్రయోజనాలపై ఆయా వర్గాల ప్రజలకు, మీడియాకు సమగ్ర సమాచారం ఇవ్వడానికి రాష్ట్ర వ్యాప్తంగా పర్యటిస్తున్నట్లు పేర్కొన్నారు. సంక్షేమ పథకాల అమలులో సీఎం జగన్ చరిత్ర సృష్టించారన్నారు. విప్లవాత్మక సంస్కరణలు ప్రవేశపెట్టారన్నారు. నిరుద్యోగులకు లక్ష ఉద్యోగాలు ఇచ్చి అండగా నిలిచారన్నారు. వృద్ధులు అవస్థలు పడకుండా ఇళ్ల వద్దకే వెళ్లి పింఛన్ అందజేసేలా చర్యలు తీసుకున్నారన్నారు. 15 వేల గ్రామ, వార్డు సచివాలయాలను ఏర్పాటు చేయడం శుభపరిణామమన్నారు. ఆర్బీకేలతో రైతులకు చేయూతనిస్తున్నారని చెప్పారు. గ్రామాలకే స్పెషలిస్టు వైద్యులను పంపి ప్రజలకు మెరుగైన వైద్య సేవలందిస్తున్నారన్నారు. వైద్య, విద్య రంగాలకు పెద్ద పీట వేసి దేశానికే ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో నంబర్ వన్‌గా నిలవడం హర్షణీయమన్నారు.

విషం కక్కడం మానాలి

ప్రభుత్వ స్కూళ్లలో ఇంగ్లిష్ మీడియం అమలు చేసే అంశంపై ప్రతిపక్షంతో పాటు ఈనాడు, ఆంధ్రజ్యోతి



మాట్లాడుతున్న కొమ్మినేని శ్రీనివాసరావు

పత్రికలు విషం కక్కాయని, మరికొందరు కోర్టుకు వెళ్లారన్నారు. కోర్టుకు వెళ్లిన వారు, ఈనాడు, ఆంధ్రజ్యోతి పత్రికాధిపతుల పిల్లలు ఇంగ్లిష్ మీడియంలో చదివినట్లు తమ పరిశీలనలో తేలిందని వెల్లడించారు. డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి సీఎంగా ఉన్నపుడు శ్రీ సిటీ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటే, ఈనాడు, ఆంధ్రజ్యోతి పత్రికలు తీవ్రంగా విమర్శించాయని, 2018లో అవే పత్రికలు 'బతుకులు మార్చిన భాగ్య సిటీ' అనే శీర్షికన కథనాన్ని ప్రచురించాయని గుర్తు చేశారు. ఆరోగ్యం బాలేదని కోర్టుకు చెప్పిన చంద్రబాబు.. అదే నిజమైతే మూడు నెలల పాటు రాజకీయ కార్యక్రమాల్లో పాల్గొనకుండా విశ్రాంతిలో ఉండాలని సూచించారు. తాత్కాలిక బెయిల్ వచ్చినపుడు 14 గంటల పాటు హైదరాబాద్‌కు ర్యాలీగా వెళ్లారని, అలాంటి వ్యక్తికి మూడు నెలల విశ్రాంతి కావాలని పేర్కొనడం విడ్డూరమన్నారు. కాగా, ఆర్ అండ్‌బీ అతిథిగృహంలో వివిధ జర్నలిస్టుల సంఘాల నాయకులు 'కొమ్మినేని'ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఇళ్ల స్థలాల కేటాయింపులో అర్హులకు న్యాయం చేయాలని వినతిపత్రం అందజేశారు.

ప్రయాణం ముందు ఆలోచించండి

అనంతపురం క్రైం: మానవ తప్పిదాలతోనే ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని ఎస్పీ అన్బురాజన్ తెలిపారు. కుటుంబ బాధ్యతలు, బాంధవ్యాలను గుర్తు చేసుకుని ప్రయాణించాలని సూచించారు. ముఖ్యంగా యువత జాగ్రత్తగా ఉండాలన్నారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. పోలీసు సిబ్బంది, అధికారులు ప్రమాదాల నియంత్రణకు కృషి చేయాలని ఆదేశించారు. రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కల్పించాలని సూచించారు. నష్టం జరిగాక కోట్లు పోసినా ప్రాణం తిరిగి రాదన్న విషయాన్ని గుర్తు చేయాలని కోరారు. ప్రమాదాల్లో గాయపడ్డ వారిని రక్షించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని సూచించారు. అంబులెన్స్ లేకపోయినా అందుబాటులో ఉన్న వాహనంలో క్షతగాత్రులను ఆస్పత్రికి చేర్చాలని విజ్ఞప్తి చేశారు. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను తీసుకెళ్లరాదన్నారు. రికార్డులు, కండీషను సరిగా లేని వాహనాలను రోడ్లపైకి తీసుకురావద్దన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపే వారి పట్ల కఠినంగా వ్యవహరించాలని పోలీసులను ఆదేశించారు. ఎస్పీ ఆదేశాలతో గురువారం జిల్లా వ్యాప్తంగా పోలీసులు వాహనదారులకు అవగాహన కల్పించారు.



ఎస్పీ అన్బురాజన్

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

అనంతపురం ఎడ్యుకేషన్: రాష్ట్రస్థాయి పోటీలకు ఏడు ప్రాజెక్టులు ఎంపికయ్యాయి. గురువారం స్థానిక సైన్స్ సెంటర్‌లో జిల్లాస్థాయి పదర్శన జరిగింది. మొత్తం 102 ప్రాజెక్టులను విద్యార్థులు సమర్పించారు. ఆర్ట్స్ కళాశాల అధ్యాపకులు జీఎల్ఎన్ ప్రసాద్, రాజశేఖర్ రెడ్డి న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. స్పర్శ (8వ తరగతి) జెడ్పీహెచ్ఎస్ ములకలేడు, అన్విత (8వ తరగతి) మాంటిస్సోరి ఎలైట్ గొల్లపల్లి, మణిదీప్ (8వ తరగతి) జెడ్పీహెచ్ఎస్ గుత్తికోట, బైయూష (7వ తరగతి) జెడ్పీహెచ్ఎస్ యల్లనూరు, మౌనిక (10వ తరగతి) జెడ్పీహెచ్ఎస్ ములకనూరు, రిషిత (9వ తరగతి) కేజీబీవీ గుత్తి, జస్వంత్‌కుమార్ (9వ తరగతి), జెడ్పీహెచ్ఎస్ కసాపురం విద్యార్థుల ప్రాజెక్టులు రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాయి. విద్యార్థులను డీఈఓ నాగరాజు, జిల్లా సైన్స్ కో ఆర్డినేటర్ ఆనంద భాస్కర్‌రెడ్డి తదితరులు అభినందించారు.

సజావుగా కౌన్సెలింగ్

అనంతపురం కార్పొరేషన్: స్థానిక డీఎంహెచ్ఓ కార్యాలయంలో స్టాఫ్‌నర్సుల పోస్టుల కౌన్సెలింగ్ గురువారం సజావుగా సాగింది. 19 పోస్టులకు 16 మంది హాజరయ్యారు. కౌన్సెలింగ్ అనంతరం డీఎంహెచ్ఓ భ్రమరాంబ దేవి నియామక పత్రాలు అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అంకితభావంతో విధులు నిర్వర్తించాలన్నారు. పేదలకు మెరుగైన సేవలందించాలన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సుజాత, కార్యాలయ అధికారి గిరిజ మనోహర్ ఉన్నారు.

కంటి ఆపరేషన్లు వేగవంతం చేయాలి

'జగనన్న ఆరోగ్య సురక్ష' వైద్య శిబిరాల్లో గుర్తించిన 3,121 మందికి కంటి ఆపరేషన్లు వేగవంతం చేయాలని డీఎంహెచ్ఓ డాక్టర్ భ్రమరాంబ దేవి ఆదేశించారు. గురువారం డీఎంహెచ్ఓ కార్యాలయంలో వివిధ కంటి ఆస్పత్రుల నిర్వాహకులతో డీఎంహెచ్ఓ సమావేశమయ్యారు. డిసెంబర్ నెలాఖరుకు శస్త్రచికిత్సలు పూర్తి కావాలన్నారు.

దీపోత్సవం.. తేజోమయం



దీపాల వెలుగులో కొత్త శోభ సంతరించుకున్న బాబా మందిర పరిసరాలు

అనంతపురంలోని వేమనా టెలిఫోన్ భవన్ ఎదురుగా ఉన్న షిర్డీసాయి బాబా మందిరంలో లక్ష దీపోత్సవం గురువారం నేత్రపర్వంగా సాగింది. కార్తీక దీపాలతో మందిరం కాంతులీనింది. మహిళలు బారులు తీరి దీపాలు వెలిగించారు. అంతకు ముందు సాయిబాబాకు ప్రత్యేక అలంకార సేవలు నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు జయచంద్ర చౌదరి, పాలక మండలి సభ్యులు నాగానందం, వెంకటేశ్వర్లు, థామస్ మన్రో ఫౌండేషన్ వ్యవస్థాపకులు తోట నాగరాజు పాల్గొన్నారు.

– అనంతపురం కల్చరల్



ఆలయంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు

క్లుప్తంగా

సమన్వయంతో మెరుగైన పోలీసింగ్‌కు కృషి



మాట్లాడుతున్న ఎస్పీ అన్బురాజన్

అనంతపురం క్రైం: సమన్వయంతో పని చేసి మెరుగైన పోలీసింగ్‌కు కృషి చేయాలని సిబ్బందికి ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ పిలుపునిచ్చారు. స్థానిక పోలీసు కాన్ఫరెన్స్ హాల్‌లో ఏఆర్ పోలీసు అధికారులతో కలసి గురువారం నిర్వహించిన కో–ఆర్డినేషన్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏఆర్ ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, ఆర్ఐలు, డీఎస్పీ, అదనపు ఎస్పీల వరకూ అప్పగించిన బాధ్యతలు, పర్యవేక్షణలను సమీక్షించారు. పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు. సమావేశంలో ఏఆర్ అదనపు ఎస్పీ హనుమంతు, ఏఆర్ డీఎస్పీమునిరాజు, ఆర్ఐలు హరికృష్ణ, రాముడు, ఆర్ఎస్ఐలు, ఏఆర్ఎస్ఐలు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య



అనూష (ఫైల్)

యాడికి: కడుపు నొప్పి తాళలేక ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు... యాడికి మండలం చందన గ్రామానికి చెందిన సిద్దమ్మ, వెంకటనారాయణ దంపతుల కుమార్తె అనూష (23)ను అదే గ్రామానికి చెందిన సమీప బంధువు పెద్ద రంగస్వామి కుమారుడు రాజశేఖర్‌కు ఇచ్చి 2016లో వివాహం జరిపించారు. ప్రస్తుతం వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. వ్యవసాయ పనులతో జీవనం సాగిస్తున్నారు. గురువారం ఉదయం 12 గంటలకు రాయల చెరువుకు వెళ్లిన రాజశేఖర్ తిరిగి సాయంత్రం 3 గంటలకు ఇంటికి చేరుకున్నాడు. ఎంతసేపు పిలిచినా తలుపు తీయకపోవడంతో చుట్టుపక్కల వారి సాయంతో తలుపులు బద్దలుగొట్టి లోపలకు ప్రవేశించారు. అప్పటికే ఫ్యాన్‌కు ఉరి వేసుకుని విగతజీవిగా వేలాడుతున్న అనూషను గమనించి కిందకు దించారు. సమాచారం అందుకున్న ఎస్ఐ గురుప్రసాదరెడ్డి అక్కడకు చేరుకుని పరిశీలించారు. మూడేళ్లుగా కడుపునొప్పితో బాధపడుతున్న ఆమె జీవితంపై విరక్తి పెంచుకుని ఆత్మహత్య చేసుకున్నట్లుగా కుటుంబసభ్యులు తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

మట్కా బీటర్ల అరెస్ట్

అనంతపురం క్రైం: స్థానిక నాల్గో పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలోని డీమార్టు సమీపంలో మట్కా రాస్తున్న ముగ్గురు బీటర్లు గురువారం పట్టుబడినట్లు సీఐ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. పట్టుబడిన వారిలో రుద్రంపేటకు చెందిన గుండ్లమడుగు నాగరాజు, బైరా రామ్, నేతాజీ నగర్ నివాసి షేక్ మహబూబ్‌బాషా ఉన్నారు. వీరి నుంచి రూ.70 వేలు నగదు, మట్కా పట్టీలు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశారు.

మంచితనమే పెట్టుబడిగా మోసం

- రూ. 4 కోట్ల వరకూ ఎగనామం పెట్టిన టీచరు రమేష్
- బాధితుల్లో 90 శాతం మంది ప్రభుత్వ ఉద్యోగులే



టీచర్ రమేష్

అనంతపురం ఎడ్యుకేషన్: విద్యాబుద్ధులు చెప్పి పిల్లలను ఉన్నతులుగా తీర్చిదిద్దాల్సిన గురువే పెడదోవ పట్టాడు. ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ రూ.వేలల్లో జీతం తీసుకుంటూ అధిక సంపాదన మోజులో చీటీల వ్యాపారాన్ని ప్రవృత్తిగా ఎంచుకున్నాడు. 20 ఏళ్లగా అనధికారికంగా చీటీలు నిర్వహిస్తూ అందరి వద్ద మంచిగా ఉంటూ నమ్మకం పెంచుకున్నాడు. ఆ మంచితనంతోనే చివరకు అందరినీ నట్టేటా ముంచేశాడు. ఈ క్రమంలోనే కొంత కాలంగా అజ్ఞాతంలోకి వెళ్లిన టీచరు రమేష్‌పై బాధితుల ఫిర్యాదు మేరకు అనంతపురం మూడో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. విషయం తెలుసుకున్న ఆయన ఇటీవల నేరుగా న్యాయస్థానంలో లొంగిపోవడంతో న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్ ఖైదీగా రెడ్డిపల్లి సెంట్రల్ జైలుకు చేరుకున్నాడు. కేసు దర్యాప్తులో భాగంగా మూడు రోజుల క్రితం పోలీసు కస్టడీకి కోర్టు అనుమతులిచ్చింది. దీంతో ఈ నెల 13 కస్టడీకి తీసుకున్న పోలీసులు రమేష్‌ను పలు కోణాల్లో విచారించారు. దాదాపు రూ. 3 కోట్లకు పైబడి బకాయిలు చెల్లించాల్సి ఉన్నట్లుగా నిందితుడు అంగీకరించినట్లు తెలిసింది.

లబోదిబోమంటున్న బాధితులు

ప్రవృత్తిలో భాగంగా టీచరు రమేష్ అనధికారికంగా రూ. 4 లక్షల మొదలు... రూ.5, 6, 10 లక్షల వరకూ చీటీలు వేస్తుంటాడు. ఈయన వద్ద చీటీలు కడుతున్న వారిలో 90 శాతం మంది టీచర్లు, ఉద్యోగులే ఉన్నారు. భవిష్యత్తు అవసరాల కోసం ముందు చూపుతో ఒక్కొక్కరూ 2 నుంచి 4 చీటీలు కడుతూ వచ్చారు. చీటీల సమయం ముగిసిన వారికి చెల్లించాల్సిన సొమ్మే రూ. 5 లక్షల నుంచి రూ.20 లక్షల వరకూ ఉన్నట్లు సమాచారం. దీనికి తోడు చాలామందికి వడ్డీ ఆశ చూపి చీటీల సొమ్మే కాకుండా మరికొంత అప్పుగా తీసుకున్నాడు. అలాంటి బాధితులందరూ ఇప్పుడు లబోదిబోమంటున్నారు. చీటీలు కట్టిన డబ్బు రాలేదు. వడ్డీ కింద ఇచ్చిన సొమ్మూ చేతికి అందలేదంటూ వాపోతున్నారు. కాగా, క్రికెట్ బెట్టింగ్‌లకు రమేష్ అలవాటుపడి ప్రజల సొమ్మును యథేచ్ఛగా వాడుకున్నట్లు ప్రచారం సాగుతోంది. దీనికితోడు రియల్ ఎస్టేట్ వ్యాపారంలోనూ నష్టాల పాలైనట్లు తెలిసింది. నమ్ముకున్న వారే రియల్ ఎస్టేట్ వ్యాపారంలో మోసం చేసినట్లు సన్నిహితుల వద్ద రమేష్ మొర పెట్టుకున్నట్లు సమాచారం.

అనధికారిక చీటీల వ్యాపారంతో మోసం

రమేష్ బాటలోనే మరికొందరు ఉపాధ్యాయులు నడుస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. అధిక సంపాదన మోజులో అనధికారిక చీటీలతో పాటు రియల్ ఎస్టేట్ వ్యాపారం సాగిస్తూ వృత్తికి తీరని ద్రోహం చేస్తున్నట్లుగా ఆరోపణలున్నాయి. చీటీలు నడుపుతున్న టీచర్లు చాలా మంది పాఠశాలలకు సక్రమంగా వెళ్లడం లేదు. తరచూ విధులకు డుమ్మా కొడుతూ తమ వ్యక్తిగత వ్యాపారాలను చూసుకుంటున్నట్లుగా తెలుస్తోంది. ఇలాంటి వారి వివరాలను విద్యాశాఖ అధికారులు సేకరించారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ప్రవృత్తిపై ఆధారపడి వృత్తిని నిర్లక్ష్యం చేస్తున్న టీచర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు ప్రభుత్వ ఉద్యోగులు కోరుతున్నారు.

శింగనమల మండలంలో పని చేస్తున్న ఓ టీచరు ఎంతో మంచిగా ఉంటున్న మరో టీచరు రమేష్‌ను నమ్మి అతని వద్ద రూ. 5 లక్షల చీటీ వేశారు. సదరు టీచరు పేరు మీద రమేష్ వ్యక్తిగత రుణం కూడా తీసుకున్నాడు. ప్రతినెలా సదరు టీచరు బ్యాంకు ఖాతా నుంచి రూ. 44 వేలు రుణం కంతులు కట్ అవుతున్నాయి. అంతేకాక మరింత డబ్బు అవసరమని చెప్పడంతో బంధువుల వద్ద నుంచి రమేష్‌కు వడ్డీకి ఇప్పించారు. ఈ క్రమంలోనే చీటీ సమయం పూర్తయింది. అయినా రమేష్ డబ్బు ఇవ్వలేదు. ఇప్పుడేమో రమేష్ చేతులెత్తేశాడు. ఎంతో మంచివాడుగా ఉంటూ తనను నట్టేటా ముంచేశాడంటూ సదరు టీచరు వాపోతున్నారు.



గార్లదిన్నె మండలంలో పని చేస్తున్న మరో టీచరు తన తమ్ముడి కుమార్తె వివాహం కోసమని ముందు జాగ్రత్తగా రమేష్ వద్ద రూ. 10 లక్షల చీటీ వేశారు. ఈ ఏడాది జూన్ నాటికి సదరు టీచరుకు చీటీ ఎత్తారు. డబ్బు చెల్లించకుండా రమేష్ ప్రతినెలా దాటవేస్తూ వచ్చాడు. ఈలోపు తమ్ముడి కుమార్తె వివాహానికి ప్రైవేట్ వ్యక్తుల వద్ద అప్పులు చేయాల్సి వచ్చింది. సెప్టెంబరు నాటికి చీటీ సమయం పూర్తయింది. అప్పటి నుంచి రమేష్ అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడు. ఈ పరిస్థితి వీరిద్దరిదే కాదు. దాదాపు 60 మందికి పైగా ప్రభుత్వ ఉద్యోగులు టీచరు రమేష్‌ను నమ్మి దగా పడ్డారు.

ఎద్దుకు అరుదైన ఆపరేషన్



ఎద్దుకు ఆపరేషన్ చేసిన పశుశాఖ, 1962 వైద్య బృందం

అనంతపురం అగ్రికల్చర్: పశుసంవర్ధకశాఖ, 1962 వైఎస్సార్ మొబైల్ అంబులేటరీ క్లినిక్ సిబ్బంది పశువైద్య సేవలు మరింత విస్తరించాయి. మూగజీవుల ప్రాణాలను సైతం విలువైనవిగా భావించి అరుదైన శస్త్రచికిత్సలతో జీవం పోస్తూ శభాష్ అనిపించుకుంటున్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమున్నత ఆశయంతో అందుబాటులోకి తీసుకువచ్చిన 1962 హెల్ప్‌లైన్ మొబైల్ అంబులెన్స్ సేవలు నూతన ఒరవడికి నాంది పలికాయి. ఏడాది కాలంగా ఎన్నో కష్టసాధ్యమైన అరుదైన శస్త్రచికిత్సలు నిర్వహించిన పశు వైద్య బృందం తాజాగా మరో సంక్లిష్టమైన ఆపరేషన్‌తో ఓ ఎద్దుకు జీవం పోసింది. వివరాలు...

బొమ్మనహాళ్ మండలం దుద్దేకుంటకు చెందిన రైతు వెంకటేశు బుధవారం ఉదయం 1962 హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేసి మూడు రోజులుగా మూత్రం బయటకు రాక తన ఎద్దు తీవ్ర ఇబ్బంది పడుతోందని తెలిపాడు. వెంటనే అప్రమత్తమైన అంబులెన్స్ డాక్టరు, సిబ్బంది అక్కడకు చేరుకుని ఎద్దును పరీక్షించారు. శస్త్రచికిత్స అవసరం కావడంతో 1962 వాహనంలో అనంతపురం పశువైద్యశాలకు తీసుకువచ్చారు. మూత్ర నాళాలలో రాళ్లు అడ్డుపడటం వల్ల ఉచ్చ ఉత్పత్తి ఆగిపోయినట్లు గుర్తించి ఆపరేషన్ తప్ప మరో మార్గం లేదని నిర్ధారించారు. అయితే శస్త్రచికిత్స తర్వాత ఫలితం ఎలా ఉంటుందో చెప్పలేమని రైతుకు నచ్చచెప్పి ఈ క్రమంలో శస్త్రచికిత్సలు చేయడంలో మంచి అనుభవం కలిగిన శింగనమల పశువైద్యశాల ఏడీ డాక్టర్ జి.పద్మనాభం నేతృత్వంలో నాలుగు గంటల పాటు శ్రమించి శస్త్రచికిత్స చేశారు. మూడు రోజులుగా పేరుకుపోయిన దాదాపు 30 లీటర్ల వరకు మూత్రాన్ని వెలికి తీశారు. అనంతరం మూత్రాశయం నుంచి నేరుగా మూత్రం బయటకు రావడానికి తాత్కాలికంగా ఫోలేస్ క్యాథెటర్ అమర్చారు. ఎద్దు పూర్తిగా కోలుకునేందుకు 14 రోజులు సమయం పడుతుందని అప్పటి వరకూ చాలా జాగ్రత్తగా చూసుకోవాలని రైతుకు సూచించి, అవసరమైన మందులు, ఇతర సామగ్రిని అందజేశారు. ఈ అరుదైన శస్త్రచికిత్సలో ఏడీ డాక్టర్ సురేష్, 1962 డాక్టర్లు డాక్టర్ సునీత, డాక్టర్ సుచరిత, డాక్టర్ గాయత్రి, పారావెట్స్ దివ్యశ్రీ, గణేష్ తదితరులు పాల్గొన్నారు. కష్టసాధ్యమైన శస్త్రచికిత్సతో ఎద్దు ప్రాణాలు కాపాడిన వైద్య బృందాన్ని పశుశాఖ జిల్లా అధికారులు డాక్టర్ వై.సుబ్రహ్మణ్యం, డాక్టర్ వెంకటేష్, డాక్టర్ వై.రమేష్‌రెడ్డి తదితరులు అభినందించారు.

శింగనమలలో ఘనంగా వరుణయాగం

- ప్రజలు సుభిక్షంగా ఉండాలనే ఆకాంక్షతోనే యాగం
- ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి దంపతులు



హోమం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ఆలూరు సాంబశివారెడ్డి

శింగనమల: వర్షం కురవాలని ఆకాంక్షిస్తూ శింగనమలలోని ఆత్మారామాలయంలో ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ఆలూరు సాంబశివారెడ్డి దంపతులు గురువారం వరుణ యాగం నిర్వహించారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు భారీగా తరలివచ్చారు. తొలుత గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఉదయం 9.30 గంటలకు రుత్వికుల వేద మంత్రోచ్చారణల మధ్య హోమం నిర్వహించారు. 2019 ఎన్నికల్లో ఎమ్మెల్యేగా జొన్నలగడ్డ పద్మావతి గెలుపొందిన తర్వాత మూడు రోజుల పాటు భక్తి శ్రద్ధలతో వరుణ యాగం చేయించారు. యాగం ముగిసిన రోజు నుంచే కొన్ని రోజుల పాటు వర్షం కురిసింది. శింగనమల చెరువు నిండి మరువ పారింది. హెచ్చెల్సీకి సమృద్ధిగా నీరు రావడంతో నియోజకవర్గ వ్యాప్తంగా రైతులు హర్షం వ్యక్తం చేశారు. నాలుగేళ్ల పాటు తాగు, సాగునీటికి ఇబ్బంది లేకుండా పోయింది. నాలుగేళ్ల పాటు శింగనమల చెరువు మరువ పారింది. చెరువులో నేటికీ నీరుంది. ఈ క్రమంలో ఇటీవల వరుణుడు మళ్లీ ముఖం చాటేయడంతో మరోసారి వరుణ యాగాన్ని ఎమ్మెల్యే దంపతులు నిర్వహించారు. ప్రజలు సుభిక్షంగా ఉండాలని, తాగు, సాగు నీటి సమస్య లేకుండా వర్షాలు పడాలని వరుణయాగం చేయిస్తున్నట్లుగా ఈ సందర్భంగా ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి తెలిపారు.

ఆటోబోల్తా - వ్యక్తి మృతి

గుంతకల్లు రూరల్: ఆటో బోల్తాపడిన ఘటనలో ఓ వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... గుత్తి మండలం వెంకటాంపల్లి నివాసి వెంకటేష్ (57)కు భార్య నాగలక్ష్మి, ఓ కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. అందరికీ పెళ్లిళ్లు చేశారు. వ్యవసాయంతో పాటు కూలి పనులతో జీవనం సాగించే వెంకటేష్ గురువారం ఉదయం నాగసముద్రం గ్రామంలో వ్యవసాయ పనులకు వెళ్లాడు. పని ముగించుకుని సాయంత్రం ఆటోలో తిరుగు ప్రయాణమైన ఆయన మరికాసేపట్లో గ్రామానికి చేరుకుంటుండగా డ్రైవర్ వేగ నియంత్రణ కోల్పోవడంతో ఆటో బోల్తాపడింది. ఘటనలో తలకు తీవ్రగాయమైన వెంకటేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. మరో ఇద్దరు కూలీలకు స్వల్ప గాయాలయ్యాయి. ఘటనపై గుంతకల్లు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

రైలు నుంచి జారిపడి.....

తాడిపత్రి టౌన్: మండలంలోని చల్లవారిపల్లి సమీపంలో ప్రమాదవశాత్తు రైలు నుంచి జారి పడి పెద్దపప్పూరు మండలం చీమలవాగుపల్లికి చెందిన మహబూబ్ బాషా (38) మృతి చెందాడు. స్థానికుల సమాచారంతో అక్కడకు చేరుకున్న రైల్వే పోలీసులు పరిశీలించారు. మృతుడి వద్ద లభ్యమైన ఆధారాలను బట్టి మహబూబ్‌బాషాగా నిర్ధారించుకుని కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. కాగా, మహబూబ్‌బాషా వైఎస్సార్ జిల్లా యర్రగుంట్లలో కూలి పనులు చేసేవాడని, స్వగ్రామానికి రైలులో వస్తూ ప్రమాదవశాత్తు కింద పడి మరణించి ఉంటాడనే అనుమానాలు వ్యక్తమయ్యాయి. మృతుడి భార్య ఆరీఫా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

శ్రీగంధం చెట్టు కొట్టేసిన కేసులో నిందితుల అరెస్ట్

- రూ.95 వేలు విలువ చేసే 15 దుంగలు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ ప్రసాదరెడ్డి (చిత్రంలో) సీఐలు శివరాముడు, జీటీనాయుడు

అనంతపురం క్రైం: జిల్లా కేంద్రం నడిబొడ్డున, ఎస్పీ క్యాంప్ కార్యాలయం పక్కనే ఉన్న అటవీశాఖ భవనంలో ఉన్న శ్రీగంధం చెట్టును కొట్టి ఎత్తుకెళ్లిన ఘటనలో ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలను గురువారం డీఎస్పీ ప్రసాదరెడ్డి తన కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. మధ్యప్రదేశ్‌లోని కట్నీ జిల్లా కూడే గ్రామానికి చెందిన అభి, సంగం పార్థీ, ఓ మైనర్ బాలుడు కలసి నగరంలోని అటవీశాఖ అధికారి బంగ్లా ఆవరణలో ఉన్న శ్రీగంధంచెట్టును 2023లో కొట్టి దుంగలు అపహరించుకెళ్లారు. ఘటనపై అప్పట్లో అనంతపురం రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. రుద్రాక్షలు సేకరించి ఆంధ్రా, తెలంగాణ, కర్ణాటక ప్రాంతాల్లో సంచరిస్తూ విక్రయించేవారు. ఈ క్రమంలో తమకు కనిపించిన విలువైన శ్రీగంధం, ఎర్రచందనం చెట్లను రాత్రికి రాత్రి కోసేసి దుంగలను తరలించుకెళ్లేవారు. అనంతపురంలో ఐదు, శ్రీసత్యసాయి జిల్లాలో ఓ చెట్టును కోసి దుంగలను తరలించారు. గురువారం ఉదయం ప్రసన్నాయపల్లి రైల్వే స్టేషన్ ఎదురుగా ఉన్న ముళ్ల పొదల్లో అనుమానాస్పదంగా తచ్చాడుతున్న ముగ్గురినీ పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేయడంతో శ్రీగంధం చెట్ల కొట్టివేత వెలుగులోకి వచ్చింది. వీరి నుంచి రూ.95 వేలు విలువ చేసే 30 కిలోల బరువున్న 15 దుంగలను స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి, న్యాయస్థానంలో హాజరుపరచనున్నట్లు పోలీసులు తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో ఉరవకొండ విద్యార్థి ప్రతిభ



శిరీష

ఉరవకొండ: సత్యసాయి జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని గత నెల రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో ఉరవకొండ విద్యార్థిని విజేతగా నిలిచింది. 'మానవత్వాన్ని పెంపొందించు విద్యావశ్యకత' అంశంపై సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్త వ్యాసరచన పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో ఉరవకొండలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఎస్సీ చివరి సంవత్సరం చదువుతున్న శిరీష పాల్గొని బంగారు పతకాన్ని దక్కించుకుంది. ఈ నెల 21న పుట్టపర్తిలో జరిగే సత్యసాయి జయంతి ఉత్సవాల్లో ఆమె ఈ మెడల్‌ను అందుకోనున్నారు. ఈ మేరకు సత్యసాయి సంస్థల ఉమ్మడి ఏపీ పూర్వ అధ్యక్షుడు డాక్టర్ ఎస్.అంజయ్య, అధ్యక్షుడు రామచంద్రమూర్తి, సేవా సమితి కన్వీనర్ దాశెట్టి రామాంజినేయులు తెలిపారు.

ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

- ఏపీ దేవదాయ శాఖ ప్రభుత్వ సలహాదారు జ్వాలాపురం శ్రీకాంత్



ఎండోమెంటు కమిషనర్ సత్యనారాయణను సన్మానిస్తున్న జ్వాలాపురం శ్రీకాంత్, శివాలయం బోర్డు సభ్యులు

అనంతపురం కల్చరల్: ఆలయాల పునరుద్ధరణ, అభివృద్ధి పనులకు రాష్ట్ర ప్రభుత్వం ఎనలేని సహకారమందిస్తోందని ఏపీ దేవదాయ శాఖ ప్రభుత్వ సలహాదారు జ్వాలాపురం శ్రీకాంత్ అన్నారు. అనంతపురంలోని వందేళ్ల నాటి కాశీవిశ్వేశ్వర కోదండరామాలయం పునరుద్ధరణ అంశంపై గురువారం ఆలయ కమిటీ మెంబర్లు తిమ్మారెడ్డి, సుబ్రహ్మణ్యం, వెంకటస్వామి, ఈఓ రమేష్‌బాబు తదితరులు గురువారం విజయవాడలో ఎండోమెంటు కమిషనర్ సత్యనారాయణ, ఎండోమెంటు సలహాదారు జ్వాలాపురం శ్రీకాంత్‌ను కలసి మాట్లాడారు. రూ.4 కోట్ల అంచనా వ్యయంతో ఆలయ అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తామని వారు హామీనివ్వడంతో హర్షం వ్యక్తంచేశారు. అనంతరం విజయవాడ కనకదుర్గమ్మ ఆలయ ఈఓ రామారావును, ఎండోమెంటు అధికారులను శివాలయం ప్రతినిధులు సత్కరించారు.

యువకుడి బలవన్మరణం

తాడిపత్రి అర్బన్: జీవితంపై విరక్తితో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు.. తాడిపత్రిలోని పోరాట కాలనీకి చెందిన చిన్న ఓబిగాళ్ల రాజేష్ (19) ఇంటర్మీడియట్ పూర్తి చేసి, ఓ ప్రైవేట్ కంపెనీలో సెక్యూరిటీ గార్డుగా పనిలో చేరాడు. అనారోగ్యం కారణంగా కొద్ది నెలల క్రితం పని మానేసి ఇంట్లోనే ఉంటున్నాడు. మానసిక స్థితి సరిగా లేకపోవడంతో కుటుంబసభ్యులు చికిత్స చేయిస్తున్నారు. జబ్బు నయం కాకపోవడంతో జీవితంపై విరక్తి పెంచుకున్న రాజేష్ గురువారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటనపై తండ్రి పుల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు సీఐ హమీద్‌ఖాన్ తెలిపారు.

18న 'డయల్ యువర్ ఆర్ఎం'

అనంతపురం సెంట్రల్: ఏపీఎస్ఆర్టీసీ అనంతపురం రీజియన్ పరిధిలో సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 18న ఉదయం 11 నుంచి 12 గంటల వరకు డయల్ యువర్ ఆర్ఎం కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ మేరకు రీజనల్ మేనేజర్ సుమంత్.ఆర్.ఆదోని గురువారం ప్రకటన విడుదల చేశారు. జిల్లా ఆర్టీసీ ప్రయాణికులు తమ సమస్యలు, సందేహాలను 9959225847 అనే నంబరుకు ఫోన్ చేసి తెలపాలని సూచించారు.

జనవాక్కు

గుండె పరీక్షలు ఉచితంగా చేశారు



కొన్నేళ్లగా గుండె జబ్బుతో బాధపడుతున్నా.. పరీక్షలు చేయించుకునే ఆర్థిక స్తోమత లేక ఇబ్బందులు పడ్డాను. ఖరీదైన మాత్రలు కొనలేని పరిస్థితి నాది. అయితే జగనన్న ఆరోగ్య సురక్షలో చికిత్స కోసం వెళితే పరీక్షించిన వైద్యులు అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి రెఫర్ చేశారు. అక్కడికెళ్తితే గుండె సంబంధిత అన్ని రకాల పరీక్షలు ఉచితంగా చేశారు. భయపడాల్సిన పనేమీ లేదని, మందులు ఉచితంగా ఇచ్చి పంపారు. ఖరీదైన వైద్య పరీక్షలు ఉచితంగా అందజేసిన ప్రభుత్వానికి రుణపడి ఉంటాం.

– ఖాజపీరా, 1వ వార్డు, ఉరవకొండ

సొంతింటి కల సాకారమైంది



సొంతిల్లు లేక 20 ఏళ్లగా బాడుగ ఇంట్లో ఉంటున్నాం. జగనన్న ప్రభుత్వం వచ్చిన తర్వాత కొలిమి లేఅవుట్‌లో రూ.3లక్షల విలువ చేసే ఇంటి స్థలం మంజూరైంది. ఇందులో గృహ నిర్మాణానికి రూ.2లక్షల ఆర్థిక సాయం కూడా అందించారు. దీంతో ఓ అందమైన ఇల్లు నిర్మించుకున్నా. మా సొంతింటి కలను జగనన్న నెరవేర్చారు. మాకెంతో సంతోషంగా ఉంది.

– సమ్రీన్, 1వవార్డు, ఉరవకొండ

ఇంటికే వచ్చి వైద్య పరీక్ష చేశారు



రెండేళ్ల క్రితం పక్షవాతం రావడంతో అనంతపురంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందాను. ఆ తర్వాత వైద్య చికిత్సలకు ఇబ్బందులు ఎదురయ్యాయి. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం కింద గత నెల వైద్య సిబ్బంది మా ఇంటికి వచ్చి పరీక్షలు చేశారు. ఆ మరుసటి రోజు గుడిపాడు గ్రామ సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో మళ్లీ వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు ఇచ్చారు. మారుమూల గ్రామాల్లో ఉన్న మాలాంటోళ్ల వ్యయప్రయాసలు పడకుండా ఇంటికే వచ్చి వైద్య పరీక్షలు చేయడం సంతోషకరం.

– రామలక్ష్మమ్మ, కుందనకోట గ్రామం, యాడికి మండలం

గతంలో ఎన్నడూ చూడలేదు



గతంలో వైద్యం కోసం ఆస్పత్రుల చుట్టూ తిరిగేవాళ్లం. ఇప్పుడు ఇంటి వద్దకే డాక్టర్లు వస్తున్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం మా ఇంటి సమీపంలోనే జరిగింది. నేను కూడా అక్కడికెళ్లి కంటి వైద్య పరీక్షలు చేయించుకున్నా. ఉచితంగా మందులు అందజేశారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలు చాలా ఓపిగ్గా తెలిపారు. ఈ తరహా వైద్య చికిత్సలు గతంలో ఎన్నడూ చూడలేదు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పాలన ఎంతో బాగుంది. మాలాంటి పేద, మధ్య తరగతి ప్రజలకు ఎంతో ఉపయోగపడుతోంది.

– దాసరి ఓబయ్య, గుంతకల్లు

ద్విచక్ర వాహనం అపహరణ

గుంతకల్లు రూరల్: కసాపురం నెట్టికంటి ఆంజనేయ స్వామి ఆలయ పరిసరాల్లో ఉంచిన ద్విచక్ర వాహనాన్ని దుండగుడు అపహరించుకెళ్లారు. పోలీసులు తెలిపిన మేరకు... నంద్యాల జిల్లా ప్యాపిలి మండలం వెంకటకొండాపురం నివాసి రామాంజనేయులు తన స్నేహితుడితో కలసి ఈ నెల 14న ద్విచక్ర వాహనంపై కసాపురం చేరుకుని హనుమద్ దీక్ష స్వీకరించారు. ఈ క్రమంలో రెండు రోజుల పాటు స్వామి సన్నిధిలోనే నిద్ర చేయాలని భావించిన వీరికి మరో దీక్షాపరుడు తనకు తానుగా పరిచయం చేసుకుని వారితో కలసి పోయాడు. 14, 15 తేదీల్లో వారితో పాటే తిరిగాడు. గురువారం ఉదయం ముగ్గురూ కలసి స్వామి దర్శనానికి వెళ్లారు. ఈ క్రమంలో స్నేహితులిద్దరూ ఆలయం ఆలయం చుట్టూ ప్రదక్షిణల్లో నిమగ్నమై పోగా, తనకు ఓపిక లేదంటూ బయటకు వచ్చిన యువకుడు లగేజీ బ్యాగ్‌లతో పాటు మొబైల్ ఫోన్లు, ద్విచక్ర వాహనాన్ని అపహరించుకెళ్లాడు. దర్శనం చేసుకుని బయటకు వచ్చిన రామాంజినేయులు తాము ఉంచిన లగేజీతో పాటు ద్విచక్ర వాహనం కనిపించకపోవడంతో వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీసీ ఫుటేజీలను పరిశీలించిన పోలీసులు రెండు రోజుల పాటు వారితో గడిపిన యువకుడే అపహరించుకెళ్లినట్లుగా గుర్తించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

విద్యార్థి దుర్మరణం



రామ్‌చరణ్(ఫైల్)

బుక్కరాయసముద్రం: ట్రాక్టర్ ఢీకొన్న ఘటనలో ద్విచక్ర వాహనం అదుపు తప్పి కిందపడి ఓ విద్యార్థి దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... బీకేఎస్ మండలం కేకే అగ్రహారం గ్రామానికి చెందిన భూషణ, మహాలక్ష్మి దంపతులు ఇటీవల మండల కేంద్రానికి వలస వచ్చారు. వీరికి ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు. భూషణ కూలి పనులతో జీవనం సాగిస్తుండగా, స్వగ్రామంలో అంగన్‌వాడీ కార్యకర్తగా మహాలక్ష్మి పనిచేస్తోంది. బీకేఎస్‌లోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న కుమారుడు రామ్‌చరణ్ (15) గురువారం కొట్టాలపల్లిలో ఉన్న స్నేహితుడి వద్దకెళ్లి పుస్తకాలు తీసుకుని ద్విచక్ర వాహనంపై తిరుగు ప్రయాణమయ్యాడు. బీకేఎస్‌లోని పోతులయ్య స్వామి గుడి వద్దకు చేరుకోగానే వేగంగా దూసుకొచ్చిన ట్రాక్టర్ ఢీకొంది. ఘటనలో రోడ్డుపై పడిన రామ్‌చరణ్ తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

క్లుప్తంగా

చియ్యేడులో 'జీవన రేఖ'



యువరైతు చందుతో మాట్లాడుతున్న అధికారులు

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం చియ్యేడులో గురువారం వ్యవసాయ సహాయ సంచాలకులు ఎం. రవి ఆధ్వర్యంలో 'జీవన రేఖ' కార్యక్రమం నిర్వహించారు. చందు అనే యువ రైతు ఇంటివద్దకు వెళ్లారు. వివిధ పంటల సాగుకు అప్పులు ఎక్కువగా చేసి ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న చందు ఎలాంటి తొందరపాటు నిర్ణయాలు తీసుకోకుండా కౌన్సెలింగ్ ఇచ్చారు. ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అన్ని శాఖల ద్వారా మనోధైర్యాన్ని నింపుతూ అర్హత కలిగిన పథకాల ద్వారా సహాయ సహకారాలు అందిస్తామని అన్నారు. కార్యక్రమంలో ఏఓ జె. శశికళ, ఈఓఆర్డీ, పంచాయతీ కార్యదర్శి, గ్రామ రెవెన్యూ అధికారి, వ్యవసాయ విస్తరణ అధికారి, రెడ్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్, ఉద్యాన శాఖ గ్రామ అధికారి పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్త మృతి

కనగానపల్లి (రాప్తాడు): రాప్తాడులోని చిన్మయనగర్ చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త సానూర్ బేగం కొడుకు సాదిక్ బాషా (23) గురువారం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న రాప్తాడు ఎంపీపీ చిట్రెడ్డి జయలక్ష్మి, వైఎస్సార్‌సీపీ మండల ఎన్నికల ఇన్‌చార్జ్ సత్యనారాయణరెడ్డి గ్రామానికి వెళ్లి మృతుడికి నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి, పార్టీ తరఫున అండగా ఉంటామని ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి తరఫున భరోసా కల్పించారు.

బ్యాంకు ఉద్యోగుల నిరసన



నిరసనలో మాట్లాడుతున్న ఉద్యోగ సంఘం నాయకులు మున్వర్ బాషా

అనంతపురం అగ్రికల్చర్: ఆలిండియా బ్యాంకు ఎంప్లాయీస్ యూనియన్ పిలుపు మేరకు స్థానిక సాయినగర్‌లో ఉన్న బ్యాంక్ ఆఫ్ బరోడా ఎదుట ఉద్యోగ సంఘాలు గురువారం నిరసన తెలియజేశాయి. ఉద్యోగ సంఘం నాయకుడు మున్వర్ బాషా మాట్లాడుతూ బ్యాంకుల్లో వర్క్ మెన్ కేడర్, సబ్ స్టాఫ్ కేడర్లలో వెంటనే నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఔట్ సోర్సింగ్ విధానం తక్షణం ఆపాలని డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమంలో ఉద్యోగ సంఘాల నాయకులు రమణరాజు, సంజయ్‌రామ్, అరవింద్, దర్శన్, మల్లికార్జున, శివానంద, కుళ్లాయిస్వామి, శివారెడ్డి, భాస్కర్, మధు పాల్గొన్నారు.


చిన్నారి ఆద్యలక్ష్మికి నృత్యరత్న పురస్కారం



చిన్నారిని ప్రశంసిస్తున్న సినీ, టీవీ ప్రముఖులు

అనంతపురం కల్చరల్: నగరానికి చెందిన మూడేళ్ల చిన్నారి ఆద్యలక్ష్మి కూడిపూడి నృత్య ప్రదర్శనతో ఆకట్టుకుంది. హైదరాబాదులో జగతి ఆర్ట్స్ సంస్థ ఆధ్వర్యంలో జరుగుతున్న బాలల దినోత్సవ ముగింపు వేడుకల్లో భాగంగా అనంతకు చెందిన అరవింద నృత్యకళా నిలయం డాన్సు మాస్టర్ సురేష్‌ను సన్మానించారు. ఆయన శిష్యురాలు ఆద్యలక్ష్మికి ప్రశంసాపత్రం, బహుమతితో పాటు నృత్యరత్న అవార్డునందించి, సత్కరించారు.

క్రీడలతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు



కబడ్డీలో తలపడుతున్న క్రీడాకారులు

గుంతకల్లు: క్రీడలతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు లభిస్తుందని శ్రీ శంకరనందగిరి స్వామి డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ కేసీ హరి పేర్కొన్నారు. గురువారం కళాశాలలో శ్రీ కృష్ణదేవ రాయ విశ్వవిద్యాలయం అంతర్ కళాశాలల మహిళ క్రీడాపోటీలు ప్రారంభమయ్యాయి. పోటీలు కళాశాల ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం అధ్వర్యంలో ఎస్కే యూనివర్సిటీ స్పోర్ట్స్ బోర్డ్ సౌజన్యంతో మూడు రోజులు పాటు జరగనున్నాయి. ఇందులో 20 కళాశాల చెందిన 300 మంది క్రీడాకారులు బాల్ బ్యాడ్మింటన్, కబడ్డీ, వాలీబాల్, చెస్, టేబుల్ టెన్నిస్, బాస్కెట్ బాల్ తదితర విభాగాల్లో పోటీల్లో పాల్గొంటారు. ఎస్కే యూనివర్సిటీ స్పోర్ట్స్ బోర్డ్ కార్యదర్శి ఎంవీ వెంకటేశన్, ఎస్కేపీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మయ్య, కళాశాల ప్రిన్సిపాల్ గోపాల్, రిటైర్డు ప్రిన్సిపాల్ రామకృష్ణనాయుడు, హైకోర్టు న్యాయవాది సీఎం విశ్వనాథ్, క్రీడా సంచాలకులు నాగార్జున, ఫిజికల్ డైరెక్టర్ మహబూబ్ బాషా, ఎన్ఎస్ఎస్ పీఓ బీ.కృష్ణయ్య పాల్గొన్నారు.

విద్యుత్ సంస్థకే షాక్!

- ఎస్టిమేషన్ లేకుండానే కనెక్షన్ల మంజూరు
- కన్వెన్షన్ హాల్‌కు సైతం గృహ విద్యుత్ కనెక్షన్!
- ఇంటి దొంగల పనితో భారీగా నష్టపోతున్న ఎస్పీడీసీఎల్



ఏకంగా 19 విద్యుత్ కనెక్షన్లు కనిపిస్తున్న ఈ అపార్ట్‌మెంట్ అనంతపురంలోని కళ్యాణదుర్గం రోడ్డులో ఉంది. నిబంధనల మేరకు ఐదు కంటే ఎక్కువ కనెక్షన్లు ఉంటే ప్రత్యేకంగా ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలి. ఈ లెక్కన ఈ అపార్ట్‌మెంట్‌కు వంద కిలోవాట్ల సామర్థ్యమున్న ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాల్సి ఉంది. అయితే ఇక్కడ మాత్రం అధికారులు నిబంధనలు తుంగలో తొక్కారు. ఎలాంటి ఎస్టిమేషన్ లేకుండానే విద్యుత్ సంస్థ ఆదాయానికి గండి కొట్టి సొంత ఖజానాను నింపుకున్నారు. కొందరు ఉద్యోగుల నిర్వాకంతో దాదాపు రూ.3 లక్షలకు పైగా ఆదాయాన్ని సంస్థ కోల్పోయింది. ఈ భవనం పక్కనే విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న ఓ లైన్‌మెన్ అపార్ట్‌మెంట్‌కు సైతం ఎలాంటి ఎస్టిమేట్లు లేకుండా విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేశారు.



అనంతపురం శివారులోని ఓ ఏసీ కన్వెన్షన్ హాలు రోజుకు 250 కిలో వాట్లకు పైగా విద్యుత్ వినియోగిస్తోంది. ఇక్కడ ప్రత్యేకంగా 300 కిలోవాట్ల సామర్థ్యమున్న ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. అయితే వాణిజ్యపరమైన విద్యుత్ కనెక్షన్ కాకుండా సాధారణ గృహ వినియోగ కనెక్షన్‌ను అధికారులు మంజూరు చేశారు. అధికారులు నిబంధనలు పాటించనందున విద్యుత్ సంస్థ రూ.లక్షల్లో ఆదాయం కోల్పోవాల్సి వచ్చింది.

అనంతపురం టౌన్: విద్యుత్ శాఖలో పని చేస్తున్న కొందరు ఉద్యోగుల అవినీతి కారణంగా ఆ సంస్థ భారీగా నష్టాలను చవిచూడాల్సి వస్తోంది. వినియోగదారులకు నాణ్యమైన సేవలను అందించడంతో పాటు సంస్థ ఆదాయ వనరులను మెరుగు పరచాల్సిన బాధ్యత ఉద్యోగులపై ఉంది. ఇందుకు విరుద్ధంగా సంస్థ ఆదాయానికి గండికొట్టి సొంత ఖజానాను నింపుకోవడం పరిపాటిగా మారింది. నిబంధనలను యథేచ్ఛగా తుంగలో తొక్కి ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్న కొందరు ఉద్యోగుల వల్ల సంస్థకు భారీ నష్టాలు చేకూరుతున్నాయనే వాదనలూ ఉన్నాయి.

లోడు పెరగడంతో ఓల్టేజీ సమస్య

ఓ విద్యుత్ కనెక్షన్ మంజూరు చేసేందుకు ముందుగా ఆ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి ఎస్టిమేషన్ రూపొందించాల్సి ఉంటుంది. అయితే ఇందుకు విరుద్ధంగా నాలుగు గోడల మధ్యనే అన్ని పనులూ చక్కబెట్టేస్తున్నారు. ఎలాంటి ఎస్టిమేషన్లు లేకుండానే ఎడాపెడాగా విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేస్తుండడంతో ట్రాన్స్‌ఫార్మర్లపై లోడు ఎక్కువ పడుతోంది. ఫలితంగా ఆయా ప్రాంతాల్లో ప్రజలు లో ఓల్టేజీ సమస్యతో ఇబ్బంది పడుతున్నారు. ఓల్టేజీ సమస్య కారణంగా అత్యంత విలువైన గృహోపకరణాలు కాలి బూడిదవుతున్నాయి. వారం రోజుల క్రితం అనంతపురంలోని జొన్న వీరయ్య కాలనీలో లో ఓల్టేజీ సమస్య కారణంగా 350 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయింది. ఆ సమయంలో కొన్ని ఇళ్లలో విలువైన విద్యుత్ ఉపకరణాలు కాలిపోయాయి. ఈ పరిస్థితి ఇటీవల జిల్లాలోని పలు ప్రాంతాల్లో తలెత్తింది. పలు ప్రాంతాల్లో కమర్షియల్ భవనాలకు ప్రత్యేకంగా ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయకుండా ఇష్టారాజ్యంగా కనెక్షన్లు మంజూరు చేయడం గమనార్హం.

భారీగా నష్టపోతున్న విద్యుత్ సంస్థ

విద్యుత్ శాఖలోని కొందరు అవినీతిపరులైన అధికారుల తీరుతో ఎస్పీడీసీఎల్ (సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్) ఏటా భారీగా నష్టాలను చవిచూస్తోంది. సంస్థకు లాభాలు చేకూర్చడం మాట అటకెక్కించి సొంత ఖజానాను నింపుకోవడంపైనే దృష్టి సారించారు. ఈ క్రమంలో ఎలాంటి ఎస్టిమేట్లు లేకుండానే ఎడాపెడ కనెక్షన్లు మంజూరు చేసేస్తూ ఏటా రూ.కోట్లలో సంస్థకు నష్టాలు తెచ్చిపెడుతున్నారు. అధికారుల జేబు నింపితే వాణిజ్యపరమైన కనెక్షన్లు ఇవ్వాల్సిన చోట కూడా సాధారణ గృహ విద్యుత్ వినియోగ కనెక్షన్లు మంజూరు చేసేస్తున్నారంటూ ఆ సంస్థ ఉద్యోగులు కొందరు బాహాటంగా పేర్కొంటుండడం గమనార్హం.

నిబంధనలు పాటించాల్సిందే

విద్యుత్ సంస్థ నిబంధనలకు లోబడే ప్రతి ఉద్యోగి పని చేయాలి. ఐదుకు మించి విద్యుత్ కనెక్షన్లు ఉంటే ఆ భవనానికి కచ్చితంగా ఎస్టిమేషన్ వేసి విద్యుత్ వినియోగాన్ని బట్టి ప్రత్యేకంగా ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయాలి. సంస్థలో కొందరు ఉద్యోగుల అవినీతిపై విచారణ చేపట్టి, వాస్తవాలు నిగ్గు తేల్చి శాఖపరమైన చర్యలు తీసుకుంటాం.

– రమేష్, ఈఈ, విద్యుత్ శాఖ

ప్రమాణాలు పాటించకపోతే చర్యలు



షాపులను తనిఖీ చేస్తున్న ఆర్టీసీ విజిలెన్స్ అధికారులు

అనంతపురం సెంట్రల్: ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో ప్రయాణికులకు విక్రయించే వస్తువులు, తినుబండారాలు ప్రమాణాలు పాటించకపోతే చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు. గురువారం బస్టాండ్ ఆవరణలోని షాపులను తనిఖీ చేశారు. ఆర్టీసీ విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు, స్టేషన్ మేనేజర్ కేఎస్ మూర్తి, అనంతపురం డిపో హెడ్ క్లర్క్ వీఎల్ఎస్ రెడ్డి, అకౌంటెంట్ ఎంఆర్ మోహన్, జూనియర్ అసిస్టెంట్ షామీర్ బాషా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు షాపులపై కేసులు నమోదు చేశారు. కార్యక్రమంలో ఎస్‌టీఐ రామాంజనేయులు, శివారెడ్డి, రాము, ట్రైనీ కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

గ్రంథాలయ ఉద్యమం స్ఫూర్తిదాయకం



గ్రంథాలయ ఉద్యమకారులకు నివాళి అర్పిస్తున్న దృశ్యం

అనంతపురం: గ్రంథాలయ ఉద్యమకారుల కృషి స్ఫూర్తిదాయకమని విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ పతికి రమేష్ నారాయణ అన్నారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా జిల్లా కేంద్ర గ్రంథాలయంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్ ఎల్ఎం ఉమాదేవి అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గ్రంథాలయ ఉద్యమకారులు అయ్యంకి రమణయ్య, పాతూరు నాగభూషణం, గాడిచర్ల హరిసర్వోత్తమరావు చిత్రపటాలకు నివాళి అర్పించారు. కార్యక్రమంలో ప్రముఖ వ్యాఖ్యాత జాగర్లపూడి శ్యాంసుందర శాస్త్రి, లైబ్రేరియన్ కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రజల జీవన ప్రమాణాల మెరుగు

- 'వై ఏపీ నీడ్స్ జగన్'కార్యక్రమంలో మేయర్ వసీం



సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ వసీం

అనంతపురం కార్పొరేషన్: వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో నవరత్నాల ద్వారా ప్రతి ఒక్కరి జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయని మేయర్ వసీం పేర్కొన్నారు. గురువారం నగరంలోని నీరుగంటి వీధి, రాణీనగర్‌లోని 9,13 సచివాలయాల పరిధిలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం జరిగింది. మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్యలు సచివాలయాల పరిధిలో జరిగిన సంక్షేమం, అభివృద్ధి బోర్డులను ఆవిష్కరించారు. అనంతరం వేణుగోపాల్‌నగర్, రాణీనగర్‌లో జరిగిన కార్యక్రమంలో మేయర్, డిప్యూటీ మేయర్లు, నగరాధ్యక్షుడు చింతా సోమశేఖర్ రెడ్డి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొండ్రెడ్డి ప్రకాష్‌రెడ్డి, కార్పొరేటర్లు సుజాత, దేవి జెండా ఆవిష్కరించారు. అనంతరం ఇంటింటా ప్రచారం చేశారు. మేయర్ వసీం మాట్లాడుతూ 9వ సచివాలయ పరిధిలో రూ.28.33 కోట్లు, 13వ సచివాలయ పరిధిలో రూ.38.33 కోట్ల సంక్షేమం, అభివృద్ధి జరిగిందన్నారు. గత ప్రభుత్వం కంటే భిన్నంగా నగరంలో రూ.800 కోట్ల అభివృద్ధి జరుగుతోందన్నారు. డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య మాట్లాడుతూ నగరంలో ప్రధాన రోడ్లు, అంతర్గత రోడ్లు, కాలువలు, తదితర అభివృద్ధి కార్యక్రమాలు పెద్ద ఎత్తున జరిగాయన్నారు. కార్యక్రమంలో మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు సైఫుల్లా బేగ్, కార్పొరేటర్లు సుమతి, లక్ష్మీదేవి, పార్టీ క్లస్టర్ అధ్యక్షుడు రమణారెడ్డి, జేసీఎస్ కన్వీనర్లు లక్ష్మన్న, నాయకులు యోగి, గంగాధర్, తిరుపాల్ రెడ్డి, ఎంఎల్‌ఓ దామోదర్ రెడ్డి, నగరపాలక సంస్థ కార్యదర్శి సంగం శ్రీనివాసులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన: 20వ డివిజన్ అంబేడ్కర్‌నగర్‌లో గడప గడపకూ మన ప్రభుత్వం నిధులు రూ.20 లక్షలతో ఏర్పాటు చేస్తున్న సీసీ రోడ్డు పనులను మేయర్ వసీం, డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి గురువారం పరిశీలించారు. అంబేడ్కర్ నగర్‌లో రూ.2.10 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు చంద్రకళ, కమల్‌భూషణ్, నాయకులు సాకే కుళ్లాయస్వామి పాల్గొన్నారు.

జగన్ మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం కావాలి



రాప్తాడులో పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు

రాప్తాడురూరల్: అన్ని వర్గాల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ, అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అమలు చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అవసరం రాష్ట్రానికి చాలా అవసరమని అనంతపురం రూరల్ జెడ్పీటీసీ సభ్యుడు చంద్రకుమార్, వైస్ ఎంపీపీ కృష్ణారెడ్డి, చియ్యేడు సర్పంచ్ గంగాధరరెడ్డి, పార్టీ మండల కన్వీనర్ దుగుమర్రి గోవిందరెడ్డి తెలిపారు. గురువారం అనంతపురం రూరల్ మండలం చియ్యేడులో 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే..' కార్యక్రమం నిర్వహించారు. ముందుగా గ్రామంలో బైకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం పార్టీ జెండా ఆవిష్కరించారు. వైస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవసరం అన్ని వర్గాలకు ఉందన్నారు. ఇంటింటా తిరిగి కరపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ చెన్నయ్య, ఆకుతోటపల్లి ఎంపీటీసీ సభ్యుడు సోమశేఖర్‌రెడ్డి, నాయకులు ఈశ్వరయ్య, రవీంద్రరెడ్డి, చలపతి, శీనా పాల్గొన్నారు.



కరపత్రాలు పంపిణీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

మళ్లీ జగనన్నే ముఖ్యమంత్రి

కనగానపల్లి(రాప్తాడు): ఆంధ్రప్రదేశ్ సుభిక్షంగా ఉండాలంటే తిరిగి జగనన్నే ముఖ్యమంత్రి కావాలని ప్రజలంతా కోరుకుంటున్నారని రాప్తాడు ఎంపీపీ చిట్రెడ్డి జయలక్ష్మి తెలిపారు. గురువారం సాయంత్రం మండల కేంద్రంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ సాల్మన్‌రాజ్ అధ్యక్షతన స్థానిక గ్రామ సచివాలయం- 1 వద్ద స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు సమావేశమై, ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధిపొందిన వారి జాబితా బోర్డులను ప్రదర్శించారు. అనంతరం మండల వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో కలసి గ్రామంలో వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మునివేలు, ఈఓఆర్డీ నరసింహారెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు పసుపుల హేమావతి, వైస్ ఎంపీపీలు రామాంజనేయులు, వరలక్ష్మి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జూటూరు శేఖర్, ఎన్నికల మండల ఇన్‌చార్జ్ చిట్రెడ్డి సత్యనారాయణరెడ్డి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

కొనసాగుతున్న గ్రంథాలయ వారోత్సవాలు



నివాళులర్పిస్తున్న గ్రంథాలయ అధికారి

చెన్నేకొత్తపల్లి: స్థానిక గ్రంథాలయంలో మూడోరోజు గ్రంథాలయ అధికారి కృష్ణయ్య ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ ఉద్యమకారులు అయ్యంకి వెంకటరమణ, డాక్టర్ ఎస్ఆర్ రంగనాథన్ చిత్రపటాలకు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు రంగారెడ్డి, నల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

పెద్దమ్మ ఆలయాభివృద్ధికి కృషి

శింగనమల: శివపురం పెద్దమ్మ ఆలయాభివృద్ధికి కృషి చేస్తానని ఆలయ చైర్మన్ తిరుపతయ్య పేర్కొన్నారు. జిల్లా దేవాదాయ శాఖ తనిఖీ అధికారి లక్ష్మీనారాయణ సమక్షంలో గురువారం ఆలయ చైర్మన్‌గా తిరుపతయ్య, సభ్యులుగా రామసుబ్బమ్మ, కామాక్షి, నాగలక్ష్మి, నాగేంద్రరెడ్డి, నారాయణరెడ్డి, లక్ష్మీనారాయణ, రామలక్ష్మమ్మ ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ డైరెక్టర్ బొమ్మన శ్రీరామిరెడ్డి, ఆలయ ఈఓ శోభ, సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీశైలానికి ప్రత్యేక బస్సు

కళ్యాణదుర్గం రూరల్: కార్తీక మాసం సందర్భంగా కళ్యాణదుర్గం నుంచి శ్రీశైలానికి ప్రతి ఆదివారం సాయంత్రం 5 గంటలకు ప్రత్యేకంగా ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పిస్తున్నట్టు డిపో మేనేజర్ రామచంద్ర గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రయాణికులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

గార్లదిన్నె: తిమ్మంపేటకు చెందిన ఓ వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాలు..గ్రామానికి చెందిన రామకృష్ణారెడ్డి(60) మూడు నెలలు క్రితం తలగాచిపల్లి సమీపంలో 44వ జాతీయ రహదారిపై రోడ్డు దాటుతుండగా వాహనం ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. అనంతపురం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రామకృష్ణారెడ్డి చికిత్స ఫలించకపోవడంతో మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు జమేదార్ దాగే నాయక్ పేర్కొన్నారు.

వైఎస్ జగన్‌తోనే అన్ని వర్గాలకూ న్యాయం



వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

అనంతపురం రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే అన్ని వర్గాల ప్రజలకూ న్యాయం జరుగుతోందని జేసీఎస్ కన్వీనర్ ఆలమూరు శ్రీనివాస రెడ్డి, వైఎస్సార్‌సీపీ అనంతపురం రూరల్ మండల కన్వీనర్ హుస్సేన్ అన్నారు. గురువారం అనంతపురం రూరల్ పంచాయతీ పరిధిలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ జెండా ఆవిష్కరించారు. అనంతరం ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల లబ్ధిపై ప్రజలకు వివరించారు. జేసీఎస్ కన్వీనర్ ఆలమూరు శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్‌సీపీ అనంతపురం రూరల్ మండల కన్వీనర్ హుస్సేన్ మాట్లాడారు. అభివృద్ధి, సంక్షేమమే తమ ప్రభుత్వ ధ్యేయమన్నారు. 2024 ఎన్నికల్లో మరోమారు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ ఉదయ్‌శంకర్, ఉప సర్పంచ్ సుమిత్ర, వైఎస్సార్‌సీపీ నాయకులు చంద్రశేఖర్, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైటీ చెరువులో నెట్టికంటుడి గ్రామోత్సవం

గుంతకల్లు రూరల్: కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో గురువారం వైటీ చెరువు గ్రామంలో స్వామి గ్రామోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ధర్మ ప్రచార రథంలో కొలువదీరిన నెట్టికంటి ఆంజనేయ స్వామికి ప్రజలు అడుగడుగునా పూజలు చేపట్టారు.

రేపు జాబ్ డ్రైవ్

గుంతకల్లుటౌన్: స్థానిక ఎస్‌కేపీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల జేకేసీ ఆధ్వర్యంలో శనివారం ఉదయం 9:30 గంటలకు జాబ్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ.లక్ష్మయ్య గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. హెటిరో ఫార్మా, వినూత్న ఫర్టిలైజర్స్ కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన పీజీ, డిగ్రీ, ఇంటర్, ఐటీఐ, టెన్త్ పాసైనవారు హాజరుకావాలని సూచించారు.

ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు



కనగానపల్లిలో ప్రభుత్వ పథకాలపై ఇంటింటా ప్రచారం చేస్తున్న ఎంపీపీ, వైఎస్సార్‌సీపీ నాయకులు

కనగానపల్లి: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని ఎంపీపీ కుంపటి భాగ్యమ్మ తెలిపారు. గురువారం మండల కేంద్రం కనగానపల్లిలో స్థానిక ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి ప్రభుత్వ పథకాలపై వారు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. స్థానిక సమస్యలపై ప్రజలతో మాట్లాడి వాటిని త్వరితగతిన పూర్తి చేయాలని ప్రజాప్రతినిధులకు సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అమరనాథరెడ్డి, డైరెక్టర్ ప్రభాకర్, నాయకులు నాగముని, పాపన్న, నల్లప్ప, సర్పంచ్ రామకృష్ణ, యూత్ కన్వీనర్ అంకె అశోక్, గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం



మాట్లాడుతున్న సీడీపీఓ వనజ అక్కమ్మ

కంబదూరు: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, ఆడపిల్లలకు 18 సంవత్సరాలు, మగపిల్లలకు 21 సంవత్సరాలు నిండిన తర్వాతనే పెళ్లి చేయాలని ఐసీడీఎస్ సీడీపీఓ వనజ అక్కమ్మ సూచించారు. గురువారం తిమ్మాపురం గ్రామంలోని గురుకుల బాలికల కళాశాలలో ఆర్డీటీ, మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాల్య వివాహాల నిర్మూలనపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు బాల్య వివాహాల నిర్మూలన, లైంగిక వేధింపుల కట్టడిపై వివరించారు. కార్యక్రమంలో ఆర్డీటీ సెక్టార్ టీం లీడర్ ఆదినారాయణ, ప్రిన్సిపాల్ జయలక్ష్మి, వైద్యాధికారి ఆసియా తదితరులు పాల్గొన్నారు.

ఎమర్జెన్సీ ఓటీ నేడు ప్రారంభం



నూతన లేబర్ ఎమర్జెన్సీ ఆపరేషన్ థియేటర్

అనంతపురం కార్పొరేషన్: వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో బోధనాస్పత్రులను మరింత బలోపేతం చేసి పేద ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని అందిస్తోంది. అందులో భాగంగా ఇప్పటికే అనంతపురం బోధనాస్పత్రిలో మౌలిక సదుపాయాలు పెంపొందించారు. కొత్తగా సర్వజనాస్పత్రిలోని లేబర్‌వార్డులో ఎమర్జెన్సీ ఆపరేషన్ థియేటర్ (ఈఓటీ)ను ప్రారంభంకానుంది. గతంలో కలెక్టర్ సాధారణ నిధులు రూ.55 లక్షలతో ఓటీ నిర్మాణం జరిగింది. పరికరాలు లేక ఆపరేషన్ థియేటర్ ప్రారంభానికి నోచుకోలేదు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో జరిగిన హెచ్‌డీఎస్ సమావేశంలో గైనిక్ వైద్యులు సమస్యను తెలియజేయగా, అందుకు ఎంపీ తలారి రంగయ్య స్పందించారు. ఎంపీ ల్యాడ్స్ కింద పరికరాల కొనుగోలుకు సహకరిస్తామని చెప్పారు. ఎంపీ లాడ్స్‌తో ఈఓటీలో మూడు టేబుల్స్, ఆటోక్లేవ్, స్టెరిలైజేషన్ బిన్స్, ఫోక్సింగ్ లైట్స్ తదితర వాటిని ఏర్పాటు చేశారు.

సకాలంలో ప్రసవం: గతంలో అక్యూట్ మెడికల్ కేర్ యూనిట్‌కు ఆనుకొని ఉన్న ఎమర్జెన్సీ ఆపరేషన్ థియేటర్‌లో కష్టతరమైన కేసులకు సిజేరియన్లు జరిగేవి. కాన్పుల వార్డు నుంచి పాత ఈఓటీకి వెళ్లడానికి సమయం పట్టేది. అలాంటి లేబర్‌వార్డులోనే ఈఓటీ ఏర్పాటుతో గర్భిణులకు మరింత మేలు జరుగుతుంది. సకాలంలో ప్రసవం జరిగేందుకు వీలుగా ఉంటుంది.

నేడు ప్రారంభం: ఎంపీ తలారి రంగయ్య చేతుల మీదుగా ఈఓటీ శుక్రవారం ప్రారంభం కానుంది. స్థానిక ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, మేయర్ వసీం, తదితరులు పాల్గొననున్నారు.

ఎస్.నాగకిశోర్‌కు డాక్టరేట్ ప్రదానం



ఎస్. నాగకిశోర్

అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురంలోని మెకానికల్ ఇంజినీరింగ్ విభాగంలో పరిశోధన చేసిన ఎస్. నాగకిశోర్‌కు గురువారం డాక్టరేట్ ప్రదానం చేశారు. ప్రొఫెసర్ ఎంఎల్ఎస్ దేవకుమార్ పర్యవేక్షణలో 'ప్రస్తుత పరిస్థితుల్లో భారతదేశంలో బొగ్గు ఆధారిత విద్యుత్ కేంద్రాలకు సీఎఫ్‌బీసీ టెక్నాలజీ ఆవశ్యకతను వివరిస్తూ 210 మెగా వ్యాట్ సీఎఫ్‌బీసీ బాయిలర్ డిజైన్ మోడల్‌ను అభివృద్ధి చేశారు. ఈ అంశంపై డాక్టరేట్ పొందారు. బొగ్గు విద్యుత్ కేంద్రాల్లో ఉన్న రెండు ప్రధాన సమస్యలయిన ఇతర దేశాల నుంచి బొగ్గు దిగుమతి, కాలం చెల్లిన బొగ్గు కేంద్రాలు సమస్యలను వివరిస్తూ.. వీటికి పరిష్కారంగా సీఎఫ్‌బీసీ టెక్నాలజీపై పరిశోధన చేశారు. ఈ టెక్నాలజీ భారతదేశంలో మరింత విస్తరిస్తే జాతీయంగా లభించే తక్కువ శ్రేణికి చెందిన బొగ్గును సమర్థవంతంగా వినియోగించొచ్చు. తద్వారా బొగ్గు దిగుమతికి ఖర్చు చేసే రూ.వేల కోట్లు ఆదా చేసుకోవచ్చు. అంతేకాకుండా సీఎఫ్‌బీసీ టెక్నాలజీతో కాలం చెల్లిన బొగ్గు విద్యుత్ కేంద్రాలను పునరుద్ధరించినట్లయితే తక్కువ ఖర్చుతో, పరికరాల్లో ఎక్కువ మార్పులు లేకుండా వీటని 25 ఏళ్ల వరకు పొడిగించొచ్చు. ఈ డిజైన్ మోడల్ పూర్తిగా భారతీయ లిగ్నైట్ బొగ్గు ఉపయోగించబడింది. ఈ అంశం పలు అంతర్జాతీయ జర్నల్స్‌లో ప్రచురించారు.